
ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

గ్యార్వీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే తలసాని

బేగంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో జరిగిన గ్యార్వీ ఉత్సవాలు జరిగాయి. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మత పెద్దలు తలసానిని ఆశీర్వదించారు. బస్తీలో కబరస్తాన్‌కు స్థలం కేటాయించినందుకు తలసానిని సన్మానించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం అదుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు టి.శ్రీహరి, నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఆరీఫ్, షేక్ అబ్బాస్, సాబేర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శుభాకర్‌కు గౌరవ పురస్కారం


గౌరవ పురస్కారం అందుకుంటున్న శుభాకర్

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి మాజీ మెడికల్ సూపర్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డా. శుభాకర్‌కు శ్రీలంక కాలేజ్ ఆఫ్ పల్మనాలజిస్ట్ జాతీయ సదస్సులో గౌరవ పురస్కారం అందుకున్నారు. ఈ నెల 9 నుంచి 15 వరకు జరిగిన సదస్సు ద్వారా ఆగ్నేయ ఆసియా దేశాల ఛెస్ట్ సొసైటీలను ఏకీకృతం చేసేందుకు డాక్టర్ శుభాకర్ చేస్తున్న కృషిని గుర్తించిన శ్రీలంక ఛెస్ట్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ నిరంజన్ దిశా నాయకే గౌరవ పురస్కారంతో సన్మానించారు. ఆదివారం నగరానికి చేరుకున్న డాక్టర్ శుభాకర్ మాట్లాడుతూ.. భారత్‌తో పాటు పాకిస్తాన్, బాంగ్లాదేశ్, శ్రీలంక పల్మనాలజిస్ట్ సొసైటీలను కలిపి ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహించేందుకు సదస్సులో తీర్మానించామన్నారు. కాలుష్యం, ఇతర దేశాల నుంచి వ్యాపిస్తున్న వైరస్‌లను కట్టడి చేసేందుకు ఆగ్నేయ ఆసియా దేశాల పల్మనాలజీ సొసైటీలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.


అవార్డులు అందుకున్న వారితో అతిథులు, సంస్థ ప్రతినిధులు

'స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్' అవార్డుల ప్రదానం

బేగంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక, సామాజిక చైతన్య సంస్థ విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన 30 మంది ప్రముఖులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం, సాలార్ జంగ్ మ్యూజియం మాజీ డైరెక్టర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ డీఎస్ రవితేజ, సంస్థ డైరెక్టర్ పూజిత, సీఈవో డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొని అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొప్ప కార్యక్రమాలు, సమాజిక సేవ చేసే ఎంతోమందికి తగిన గుర్తింపు రావడం లేదని, అటువంటి వాళ్లను గుర్తించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

ఇంట్లో గంజాయి మొక్క పెంచుతున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గంజాయికి అలవాటు పడ్డ ఓ వ్యక్తి ఇంట్లోనే గంజాయి మొక్క పెంచుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటగిరిలో ఓ వ్యక్తి గంజాయి మొక్క పెంచుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే బేగ్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో నాలుగవ అంతస్తులో ఉన్న ఓ ఫ్లాట్‌లో పోలీసులు తనిఖీ చేయగా గంజాయి మొక్క లభించింది. దాన్ని పెంచుతున్న అర్షద్ అలీని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్గీకరణలో మాలలకు అన్యాయం

- 2011 జనాభా లెక్కలు ఆమోదయోగ్యం కాదు
- మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య

పంజాగుట్ట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని, 2011 జనాభా లెక్కలు వర్గీకరణకు ఆమోదయోగ్యం కాదని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను కలిసి వర్గీకరణలో తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. 2011లో ఉప కులాల వారీగా జనాభా లెక్కింపు జరగలేదని, ఆ లెక్కలకు, వర్గీకరణ చేసిన లెక్కలకు రెండు లక్షలకు పైగా వ్యత్యాసముందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రకు చెందిన మాలలు ఎక్కువగా లబ్ధి పొందడం వాస్తవమేనని, అయితే తెలంగాణలోని మాలలు మాదిగల కన్నా వెనుకబడ్డారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎస్సీలలో విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు, రాజకీయ పదవుల్లో ఎవరు ఎక్కువ లబ్ధిపొందారో లెక్కలు బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల శాతాన్ని పెంచి పంజాబ్ రాష్ట్రం మాదిరిగా సమానంగా కేటాయించాలని,లేదంటే తమిళనాడు తరహాలో రిజర్వేషన్ శాతాన్ని పెంచి వెనుకబాటుకు గురైన వారికి కేటాయించాలని కోరారు. తమ మనోభావాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా వర్గీకరణ చేస్తే కాంగ్రెస్ పార్టీ తన గొయ్యి తానే తవ్వుకున్నట్టేనని చెప్పారు. అన్ని విషయాలను పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తామని భట్టివిక్రమార్క హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

దుమ్ము రేగుతోంది..

ప్రధాన రోడ్లపై వాహన చోదకుల అవస్థలు

- కళ్లలో దుమ్ము పడుతుండటంతో ప్రమాదాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


దుమ్ములో వాహనదారుల ప్రయాణం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరిలోనే ఎండలు పెరిగిపోయాయి. దీంతో గత వారం రోజులుగా రోడ్లపై దుమ్ము లేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హిల్స్ రోడ్లపై దుమ్ము రేగుతుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మట్టి కళ్లలోకి చేరి ఇబ్బందులకు గురవుతున్నారు. బంజారాహిల్స్ జూబ్లీహిల్స్ అంతర్గత దారుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ప్రధాన దారుల్లోనూ దుమ్ము తెరలుగా లేస్తోంది. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు కనీసం మట్టిని తొలగించే ప్రయత్నం చేయడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10, 45, 72లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. రోడ్డుపై పొర కొట్టుకుపోయి కంకర, మట్టి బయటపడ్డాయి. గాలి వీచినప్పుడల్లా దుమ్ము పెద్ద ఎత్తున లేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కళ్లలోకి, నోట్లోకి దుమ్ము వెళుతుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి తోడు రాళ్ల తేలడంతో మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రాళ్ల కారణంగా వాహనాలు స్కిడ్ అవుతుండటంతో ప్రయాణికులు కిందపడి గాయాల పాలవుతున్నారు. అయితే ఈ దుమ్ము మనిషి శరీరంలోకి వెళ్లి అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఆస్తమాకు దారితీసే ప్రమాదం

కాలుష్యం వల్ల చిన్న అలర్జీ ఏర్పడినా సకాలంలో వైద్యం చేయించుకోకపోతే ఆస్తమాకు దారితీసే ప్రమాదం ఉంది. అలర్జీకి వైద్యులు సూచించినంత కాలం తప్పనిసరిగా మందులు వాడాలి. అప్పుడే క్రిములు నాశనం అవుతాయి. బయట తిరిగి వారు ఇంటికి వెళ్లగానే తప్పనిసరిగా ముక్కును శుభ్రపర్చుకోవాలి. అప్పుడే 60 శాతం క్రిములు బయటకు వెళ్లిపోయే అవకాశం ఉంటుంది. ముక్కును శుభ్రపర్చుకునేందుకు మార్కెట్లో రబ్బరు సిరంజీలు లభిస్తున్నాయి. వాటిని వాడితే మంచి ప్రయోజనం ఉంటుంది. అలర్జీ బారిన పడకుండా ఉండాలంటే ముక్కును క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి.

\- డాక్టర్ మేఘనాథ్, ఈఎన్‌టీ వైద్యుడు, మా ఆస్పత్రి

మాస్కులతో ఫలితం ఉండదు

దుమ్ము నుంచి రక్షించుకునేందుకు చాలా మంది మాస్కులు వాడుతున్నారు. కాని వీటి వల్ల ప్రయోజనం లేదని ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ కేఆర్ మేఘనాథ్ చెబుతున్నారు. దుమ్ము, దూళీలో భయంకరమైన రసాయనాలు ఉంటాయని, వీటిని అడ్డుకునే బలం మాస్కులకు లేదని ఆయన అంటున్నారు. ఫిల్టర్‌తో కూడిన మాస్కులు కొంత వరకు మేలు చేస్తాయి. అయితే వీటిలో ఉన్న ఫిల్టర్‌లను ప్రతి గంటకోసారి కడిగి ఆరబెట్టి వాడితేనే తగిన ఫలితం ఉంటుందని చెబుతున్నారు. మాస్కులు పెట్టుకోగానే దుమ్ము శరీరంలోకి వెళ్లదనే అపోహ మాని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచిస్తున్నారు.

పదవులు కాదు.. సమాజ శ్రేయస్సు ముఖ్యం

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బండ ప్రకాష్ ముదిరాజ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పదవులు ముఖ్యం కాదని, సమాజ శ్రేయస్సు కోసం పనిచేయడం ముఖ్యమని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. కులం కోసం పనిచేసేందుకు ఎవరు ముందుకొచ్చినా వారికి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. తెలంగాణ ముదిరాజ్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బండ ప్రకాష్ మాట్లాడుతూ.. న్యాయవాదులు, ముదిరాజ్‌ల ఉద్యమానికి సుదీర్ఘమైన చరిత్ర ఉందన్నారు. గతంలో కాసాని జ్ఞానేశ్వర్ నేతృత్వంలో న్యాయవాదుల సంఘం పనిచేసిందని, అయితే ఆ తర్వాత కాలంలో ఎలాంటి చర్యలు లేవన్నారు. యువత ఎంతో ఆసక్తితో న్యాయవాద వృత్తిలోకి వస్తున్నారని, వారిని ప్రోత్సహించాలన్నారు. ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే కన్నా ప్రస్తుతం చేపట్టిన కుల సర్వేలో జనాభా ఎందుకు తగ్గిందని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి మన సత్తా ఏమిటో చూపుదామన్నారు.

రెండేళ్లయినా పూర్తికాని పనులు

- తాగునీటి కోసం జవహర్‌నగర్, మసీద్‌గడ్డ ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


జవహర్‌నగర్ మైదానంలో వృథాగా పడి ఉన్న తాగునీటి పైపులు

వెంగళరావునగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్, మసీద్ గడ్డ ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా నీరు వస్తున్నా స్థానికుల అవసరాలకు సరిపోవడం లేదు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు సంబంధిత అధికారులు, కార్పొరేటర్‌కు పలుమార్లు మొరపెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేదు. అయితే రెండు సంవత్సరాల క్రితం సమస్య పరిష్కారానికి సుమారు రూ.45 లక్షల నిధులు సైతం మంజూరయ్యాయి. పైప్‌లైన్ వేయడానికి జలమండలి అధికారులు టెండర్లు పిలిచారు. అయితే పనులు ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఆ పైపులు తీసుకొచ్చి జవహర్‌నగర్ మైదానంలో, ప్రధాన రహదారిలో వేయగా అవి వృథాగా పడి ఉన్నాయి. అధికారులు స్పందించి ఎండాకాలం రాకముందే పనులు పూర్తిచేసి తమకు మంచి నీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు.


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ముప్పిడి నవీన్ కుమార్

పేదలకు అండగా ఉంటాం

- దళిత చైతన్య సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్

అమీర్‌పేట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దళిత చైతన్య సంఘం పేద, మధ్యతరగతి వర్గాలకు అండగా ఉంటుందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ అన్నారు. సంఘం ఏర్పడి 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద పేద మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ముప్పిడి నవీన్ కుమార్ తన తల్లి శాంతాబాయి చేతుల మీదుగా చీరలను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న దళితులను ఏకం చేస్తూనే ఇతర కులాల్లోని పేదలకు అండగా ఉంటామన్నారు. ఎప్పటికప్పుడు పేదల సమస్యలను తెలుసుకుని పాలకుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా తమ సంఘం కృషి చేస్తుందన్నారు. అంతకుముందు బల్కంపేట ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ తల్లి పాదాల వద్ద ఉచితంగా పంపిణీ చేసే చీరలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అభిషేక్, సందీప్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'హలో ఆర్‌ఎంపీ-చలో హైదరాబాద్'

పంజాగుట్ట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18న వేలాదిమందితో హలో ఆర్‌ఎంపీ-చలో హైదరాబాద్ గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభను ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్నామని తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తదితరులు హాజరవుతారని.. గ్రామీణ వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రీ సర్వేలో పేర్లు నమోదు చేయించుకోవాలి

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మొదటి దఫా కులగణనలో పేర్లునమోదు చేసుకోని బీసీలు రీ సర్వేలో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ సూచించారు. కులగణన రీ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం ఆయన బీసీ వెల్ఫేర్ అధికారులు, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి చాంద్రాయణగుట్ట కుమ్మరివాడి బస్తీలో ప్రజలకు అవగాహన కల్పించారు. 200 ఇళ్లను పరిశీలించగా అందులో 71 కుటుంబాల వారు పేర్లు నమోదు చేసుకోలేదన్న విషయం తేలింది. సర్వే స్టిక్కర్లు అంటించారు కానీ ఎన్యూమరేటర్లు తమ ఇంటికి రాలేదని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ.. సర్వే పూర్తి స్థాయిలో జరగలేదని, బీసీల జనాభా తక్కువగా చూపారంటూ పలురకాల అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు రీ సర్వే చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారులు ఆశన్న, నర్సింహులు, సుశాంత్, సునీల్ బాబు, అంజనేయులు, టీపీసీసీ కార్యదర్శి బి.వెంకటేశ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు బోయ నగేశ్, కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్, ఎ.మహేశ్‌గౌడ్, రాజుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2025 సంవత్సర క్యాలెండర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆయన నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ముదిరాజ్ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యత ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేష్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.భట్టు విఠల్ ముదిరాజ్, ధనరాజ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జంగయ్య ముదిరాజ్, సీఐలు నర్సింగ్ ముదిరాజ్, భాస్కర్ ముదిరాజ్, ఎస్ఐ కృష్ణమూర్తి ముదిరాజ్, కోశాధికారి మహేష్ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులు, జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.


జలగం వెంగళరావు పార్కులో మొక్కను నాటుతున్న సంతోష్‌కుమార్, కోలేటి దామోదర్ తదితరులు

వెంగళరావు పార్కులో వృక్షార్చన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని జలగం వెంగళరావు పార్కులో ఆదివారం వృక్షార్చన కార్యక్రమం నిర్వహించారు. జలగం వెంగళరావు పార్కులో జరిగిన కార్యక్రమంలో భాగంగా రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


వస్త్ర ప్రదర్శనకు వచ్చిన సందర్శకులు

ఆకట్టుకుంటున్న 'సిల్క్ ఇండియా' వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటు చేసిన సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటుంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి అందుబాటులో ఉన్నాయి. వివాహాల సీజన్ కావడంతో మహిళలు పెద్దఎత్తున ఈ ప్రదర్శనను సందర్శిస్తున్నారు. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శనకు ప్రవేశ ఉచితం అని, ఈ నెల 21 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

బండెక్కిన గుర్రం


గుర్రాన్ని వ్యాన్‌లో ఎక్కించుకుని రథాన్ని వాహనానికి కట్టి ఇలా రైలు పట్టాలు దాటుతూ రాజ్‌భవన్ మార్గంలో కనిపించిన దృశ్యం

ప్రకృతి కనువిందు


ఎన్టీఆర్ మార్గ్‌లోని ఇందిరా గాంధీ చౌరస్తాలో రంగు రంగుల పూలు ఇలా కనువిందు చేస్తున్నాయి.

అద్భుతం.. ఆవిష్కృతం


ట్యాంక్‌బండ్ వద్ద ఆదివారం సూర్యాస్తమయం సమయంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కృతమైన అద్భుత దృశ్యం


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా మార్కండేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

అడ్డగుట్ట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలోని మార్కండేయ దేవాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రెండో రోజు ప్రత్యేక పూజలు జరిగాయి. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు సంతోష్, చిలివేరి రామకృష్ణ, కత్తుల సుదర్శన్, కల్లెపల్లి రాజు, వెల్ది జనార్దన్, బొమ్మ నరేందర్, పెండెం సంతోష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంకి రవీందర్

సీఎంను విమర్శించే అర్హత రామకృష్ణకు లేదు

- కంటోన్మెంట్ వికాస్ మంచ్ కార్యదర్శి రవీందర్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణకు లేదని కంటోన్మెంట్ వికాస్ మంచ్ కార్యదర్శి సంకి రవీందర్ అన్నారు. కంటోన్మెంట్ ప్రజలు వివిధ రకాల పన్నుల ద్వారా చెల్లించే ఆదాయంతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇందులో కేంద్ర ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. ఆదివారం పికెట్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీలు 7.5 శాతం ఉంటే కంటోన్మెంట్‌లో 11 శాతం వసూళ్లు చేస్తున్నారని, దీనికి బీజేపీ నాయకులు ఏ సమాధానం చెబుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే టీపీటీ చార్జీలు క్రమం తప్పకుండా చెల్లింస్తోందని.. దీనికి తామేదో చేసినట్లు నామినేటెడ్ సభ్యులు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు రక్షణ శాఖ నుంచి కంటోన్మెంట్‌కు రావాల్సిన రూ.900 కోట్ల సర్వీస్ చార్జీ బకాయిలు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగినేని సరిత తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేసిన డీబీఎఫ్ సభ్యులు

దళితులపై దాడులను సహించం

- దళిత బహుజన ఫ్రంట్ కార్యదర్శి కల్పన

బౌద్ధనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దళితులు ఆత్మగౌరవంతో జీవించడాన్ని జీర్ణించుకోలేక ఆధిపత్య వర్గాలు దాడులు చేస్తున్నాయని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహానికి 13వ వారం జ్ఞానమాల వేశారు. అనంతరం పులి కల్పన మాట్లాడుతూ.. తమిళనాడులో దళిత విద్యార్థి బుల్లెట్ బండి నడపాన్ని సహించని ఆధిపత్య విద్యార్థులు చేతివేళ్లను నరకడాన్ని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఆధునిక యుగమని చెబుతున్న ప్రస్తుత కాలంలో సైతం దళితులపై దాడులు చేస్తూ ఆటవికంగా ప్రవర్తించడం సహించరానిదన్నారు. నిందితులను కఠినంగా శిక్షించేవరకు ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నగర నాయకులు చీకోటి సుజాత, వెంకటమ్మ, కవిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి మృతి

వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం ముగ్గురి మృతి చెందారు. మౌలాలి- చర్లపల్లి రైల్వే స్టేషన్‌ల మార్గమధ్యలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ రైల్వే ఉద్యోగి మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఎదురుగా వస్తున్న రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.

రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి


మృతి చెందిన గాజుల శ్రీధర్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతున్న రైల్వే ఉద్యోగిని రైలు ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటన మౌలాలి- చర్లపల్లి రైల్వే స్టేషన్‌ల మార్గమధ్యలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాకకు చెందిన గాజుల శ్రీధర్(51), సికింద్రాబాద్ లాలాగూడ రైల్వే వర్క్స్ షాపులో సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కార్యాలయంలో ఉద్యోగి. ఆదివారం మౌలాలి- చర్లపల్లి రైల్వే స్టేషన్ మార్గమధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా ఆ సమయంలోనే వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో బలమైన గాయాలై అతడు అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


ఉమేష్ కుమార్ మృతదేహం

ప్లాట్ ఫాంపై నిలబడి ఉన్న ఓ ప్రయాణికుడు ఎదురుగా వస్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ కోటరి జిల్లా మాల్గా, బాతిసారీ గ్రామానికి చెందిన ఉమేష్ కుమార్(22) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం మెదటి ప్లాట్ ఫాంపై నిలబడి ఉన్నాడు. రెండో ప్లాట్‌ఫాంపైకి సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండగా జంప్ చేసి, రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరు కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి


సులోచన (ఫైల్)

తిరుమలగిరి ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు పరిస్థితి విషమించి మృతి చెందింది. కల్లు తాగిన మైకంలో ఓ వృద్ధురాలు శనివారం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే.. 95శాతం కాలిన గాయాలతో ఉన్న సులోచనను తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సంధ్య చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున చనిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కంటోన్మెంట్ పికెట్ పార్కులో భారీ విగ్రహం

- చురుగ్గా సాగుతున్న వాజ్‌పేయి విగ్రహ నిర్మాణ పనులు
- 8 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం.. 12 ఫీట్ల కాంస్య విగ్రహం ఏర్పాటు
- మార్చి చివరి వారంలో ప్రారంభానికి సన్నాహాలు

నగర కిరీటంలో మరో అద్భుతం జరగనుంది. జంట నగరాల్లో మరెక్కడా లేనివిధంగా దివంగత నేత, మాజీప్రధాని, అజాతశత్రువుగా పేరు గడించిన అటల్ బిహారీ వాజ్‌పేయ్ భారీకాంస్య విగ్రహాన్ని కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వాజ్‌పేయి శతజయంతి వేడుకల్లో భాగంగా నిర్మాణ పనులు చేపడుతున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పికెట్ జూబ్లీ బస్టాండ్ సమీపంలో ఉన్న పార్కులో విశాలమైన 8 ఎకరాల విస్తీర్ణ ప్రాంగణంలో ఈ వాజ్‌పేయ్ విగ్రహాన్ని నిర్మించి త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

మారేడుపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ పికెట్ పార్క్.. ఇక నుంచి కంటోన్మెంట్ బోర్డు తీర్మానంతో వాజ్‌పేయ్ పార్క్‌గా నామకరణం చేశారు. వాజ్‌పేయ్ 1924 డిసెంబర్ 25న జన్మించి, 2018 ఆగస్టు 16న మృతిచెందారు. ఆయన జ్ఞాపకార్థం ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తిస్తూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో వాజ్‌పేయ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. విశాలమైన పార్కులో వి గ్రహ ఏర్పాటు పనులు ఉత్సాహంగా జరగుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ విగ్రహం ఏర్పాటుకు లైన్ క్లియర్ కాగా అందుకు అనుకూలంగా కంటోన్మెంట్ అధికారులు కూడా స్పందించి అనుమతులు ఇచ్చారు. దీంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. జంట నగరాల్లో వివిధ చోట్ల చిన్నచిన్న విగ్రహాలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద విగ్రహం కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేయడం విశేషం. అదీగాక ఈ భూములన్నీ రక్షణ శాఖకు సంబంధించనవి కావటం, రక్షణ శాఖ కంటోన్మెంట్ ఏరియాలో ఏర్పాటు చేయటం, అటు కంటోన్మెంట్‌కు ఇటు హైదరబాద్‌కు పేరు పెంపొందించాలని పలువురు భావిస్తున్నారు. అరుదైన గౌరవం అటల్ బిహారీ వాజ్‌పేయ్‌కు ఈ విగ్రహం ఏర్పాటు వల్ల లభిస్తుందని చారిత్రాత్మకంగా ఈ విగ్రహం నిలిచిపోతుందని అందరూ భావిస్తున్నారు.

గతంలో ఈ పార్కు... పరిసర ప్రాంతాలు వర్షాకాలంలో అధికంగా వర్షపు నీరు చుట్టుపక్కల ఉన్న మురికి కాలువాల నీరు అధికంగా వచ్చి నిలువడం, మూడు నాలుగు రోజుల వరకు అయ్యేవరకు క్లీన్ కాక పోవడం.... దోమలు విస్తరించడం... అపరిశుభ్రంగా ఉండడంతో ఆ పార్కు వారం పాటు అందుబాటులో ఉండదు. అలాంటి సమయంలో పార్కులోకి అధికారులు సందర్శకులను అనుమతించేవాళ్లు కాదు. ఇలాంటి పరిస్థితులు మున్ముందు ఈ విగ్రహం ఏర్పాటు అయినాక అక్కడ లేకుండా చేసేందుకుగాను వర్షపు నీరు సులభంగా పోయేటట్లు, డ్రైనేజీ నీరు అక్కడికి రాకుండా చూసే ఏర్పాట్లు కూడా కంటోన్మెంట్ అధికారులు, విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు శ్రద్ధ చూపాలని పర్యాటకులు, సందర్శకులు విజ్ఞప్తి చేస్తున్నరు.

విగ్రహం ఏర్పాటు చేసిన తరువాత సందర్శకులు కూడా రావడంతో ఎక్కువ తాకిడి పార్కు మీద ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ పార్కుకు అనుబంధంగా చిల్డ్రన్స్ పార్కు, గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, క్రీడా మైదానం ఇతర అభివృద్ధి పనులు కూడా ఇక్కడ అభివృద్ధి చేస్తే కుటుంబ సమేతంగా వచ్చి సేదతీరడానికి వీలుంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఈ పార్కులో జూబ్లీ బస్‌స్టాండ్‌లో బస్సుల కోసం వెయిటింగ్ చేసేవాళ్లు, మెట్రో ట్రైన్ కోసం వెయిటింగ్ చేసేవాళ్లు, తాగుబోతులు, తిరుగుబోతులు, ప్రేమికులు అక్కడ అడ్డాగా మార్చుకొని ఆ పార్క్‌ను కలుషితం చేస్తున్నారని వారికి ఇది ఉపయోగపడుతుందని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు మున్ముందు ఏర్పడకుండా ఆ పార్క్ వాతావరణాన్ని పరిశుభ్రంగా, శాంతి భద్రతలతో మంచి వాతావరణాన్ని, ఆహ్లాదకరమైన పరిస్థితులు ఉండేలా ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా వాకింగ్ ట్రాక్ కూడా అక్కడ ఏర్పాటు చేస్తే దానికి కాలనీవాసులకు సౌకర్యంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని పార్క్‌ను చుట్టుపక్కల జంట నగరాల్లో మరి ఎక్కడా లేనంతగా సుందీరకరణ చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ పికెట్ పార్క్‌లో ఏర్పాటుచేస్తున్న వాజ్‌పేయ్ కాంస్య విగ్రహం ఏర్పాటు పనులతోపాటు సుందరీకరణ పనులను పర్యవేక్షిస్తున్నారు. మార్చి చివరి వారంలో విగ్రహాన్ని ఆవిష్కరించడానికి సన్నాహాలు చేస్తున్నారు.


పార్కులో సుందరీకరణ పనులు

అవిష్కరణకు సిద్ధంగా ఉన్న వాజ్‌పేయ్ కాంస్య విగ్రహం


కంటోన్మెంట్ పికెట్ పార్కు

ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు



వాజ్‌పేయ్ విగ్రహాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, మరెక్కడా లేని విధంగా 12 ఫీట్ల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కేంద్ర రక్షణ శాఖ మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేసి వాజ్‌పేయ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ ఏర్పాట్లకు పార్కులో అనుమతులకు రక్షణ శాఖ నుంచి సహకరించిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌కు కృతజ్ఞతలు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న పార్కు అభివృద్ధి పనులు పూర్తి కావచ్చాయి. త్వరలో పనులు పూర్తిచేస్తాం. జంట నగరాలతో పాటు మరెక్కడా ఇటువంటి విగ్రహం లేదు.

\- జెన్నావుల రామకృష్ణ, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు

పార్క్ అభివృద్ధికి కంటోన్మెంట్ బోర్డు నిధులు

దేశవ్యాప్తంగా అటల్ బిహారీ వాజ్‌పేయ్ శతజయంతి వేడుకల్లో భాగంగా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారు. అందులో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధ్వర్యంలో పికెట్ పార్క్‌లో వాజ్‌పేయ్ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిధులను కంటోన్మెంట్ బోర్డు భరిస్తుంది. సుందరీకరణ ఏర్పాట్లు చేస్తూ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారు.

\- దినేష్, కంటోన్మెంట్ బోర్డ్ ఇంజనీర్


ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

గ్యార్వీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే తలసాని

బేగంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో జరిగిన గ్యార్వీ ఉత్సవాలు జరిగాయి. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మత పెద్దలు తలసానిని ఆశీర్వదించారు. బస్తీలో కబరస్తాన్‌కు స్థలం కేటాయించినందుకు తలసానిని సన్మానించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం అదుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి, నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఆరీఫ్, షేక్ అబ్బాస్, సాబేర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శుభాకర్‌కు గౌరవ పురస్కారం



గౌరవ పురస్కారం అందుకుంటున్న శుభాకర్

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి మాజీ మెడికల్ సూపర్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డా. శుభాకర్‌కు శ్రీలంక కాలేజ్ ఆఫ్ పల్మనాలజిస్ట్ జాతీయ సదస్సులో గౌరవ పురస్కారం అందుకున్నారు. ఈ నెల 9 నుంచి 15 వరకు జరిగిన సదస్సు ద్వారా ఆగ్నేయ ఆసియా దేశాల చెస్ట్ సొసైటీలను ఏకీకృతం చేసేందుకు డాక్టర్ శుభాకర్ చేస్తున్న కృషిని గుర్తించిన శ్రీలంక చెస్ట్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ నిరంజన్ దిశా నాయకే గౌరవ పురస్కారంతో సన్మానించారు. ఆదివారం నగరానికి చేరుకున్న డాక్టర్ శుభాకర్ మాట్లాడుతూ.. భారత్‌తో పాటు పాకిస్తాన్, బాంగ్లాదేశ్, శ్రీలంక పల్మనాలజిస్ట్ సొసైటీలను కలిపి ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహించేందుకు సదస్సులో తీర్మానించామన్నారు. కాలుష్యం, ఇతర దేశాల నుంచి వ్యాపిస్తున్న వైరస్‌లను కట్టడి చేసేందుకు ఆగ్నేయ ఆసియా దేశాల పల్మనాలజీ సొసైటీలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.


అవార్డులు అందుకున్న వారితో అతిథులు, సంస్థ ప్రతినిధులు

'స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్' అవార్డుల ప్రదానం

బేగంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక, సామాజిక చైతన్య సంస్థ విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన 30 మంది ప్రముఖులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం, సాలార్ జంగ్ మ్యూజియం మాజీ డైరెక్టర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ డీఎస్ రవితేజ, సంస్థ డైరెక్టర్ పూజిత, సీఈవో డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొని అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొప్ప కార్యక్రమాలు, సమాజిక సేవ చేసే ఎంతోమందికి తగిన గుర్తింపు రావడం లేదని, అటువంటి వాళ్లను గుర్తించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

ముషీరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ క్రీడలపై దృష్టి సారించాలని థైక్వాండో తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి సీహెచ్.మారుతీవరప్రసాద్ అన్నారు. థైక్వాండో చాంపియన్‌షిప్ 2025 పోటీలను తెలంగాణ థైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ.. కరాటేతో తనను తాను రక్షించుకోవడంతోపాటు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో థైక్వాండో క్రీడాకారులు మీర్ వహాజ్, అలీఖాన్, మహేశ్వర్, మల్లిక, కృష్ణ, నర్సింహ, విజయ్ కుమార్, సురేష్, ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

క్యారం టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కార్ఖానా మహంకాళి ఆలయం వద్ద సుశీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటోన్మెంట్ క్యారం టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని, క్రీడలు మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చుదిద్దుతాయన్నారు. గెలుపు స్ఫూర్తి నింపితే, ఓటమి సమయంలో అవసరమైన మనోధైర్యాన్ని నేర్పుతాయన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులను, నిర్వాహకులను ఆయన అభినందించారు.



వీడ్కోలు సమావేశంలో విశ్వాసకులతో మాట్లాడుతున్న శరవణన్

శరవణన్ 18 ఏళ్లుగా చర్చిల్లో సేవలందించారు

మారేడుపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి ది పెంతుకోస్తు మిషన్ చర్చిలో బ్రదర్‌గా సేవలు అందిస్తున్న శరవణన్ తమిళనాడు నుంచి సికింద్రాబాద్ వచ్చి గత 18 సంవత్సరాలుగా పలు చర్చిల్లో సేవలు అందించారని క్రైస్తవ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షులు జేరుషలేం మత్తయ్య కొనియాడారు. ఆదివారం జరిగిన వీడ్కోలు సమావేశంలో శరవణన్ మాట్లాడుతూ.. ఢిల్లీలో సేవలందించేందుకు టీపీఎం చర్చి తరఫున బదిలీపై వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.జాన్, ప్రభుదాస్, ఆనంద్, జోస్విన్, ఏనోషు హెప్సిభ, ఎబ్బేజ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

- విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి


అమిత్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పాడి రైతులు

తార్నాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పాడి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి అన్నారు. ఆదివారం లాలాపేట్‌లోని విజయ డెయిరీ ఆవరణలో తెలంగాణలోని పలు జిల్లాల నుంచి వచ్చిన పాడి రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతులు గత 15 నెలలుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా ప్రతి 15 రోజలకు ఒకసారి చెల్లించాల్సిన పాల బిల్లులు 2 నెలలకు ఒకసారి చెల్లించడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లులను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా జిల్లాల్లో పాడి రైతులతో పీఏపీ కమిటీలను ఏర్పాటు చేయాలని, పాడి రైతు ప్రమాదంలో చనిపోతే రూ.1 లక్ష చెల్లించాలని కోరారు. స్పందించిన చైర్మన్ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

- బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్

తార్నాక, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే దేశవ్యాప్తంగా కులగణను చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల లెక్కలు లేకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బీసీల కులగణనలో నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్‌లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఇంట్లో గంజాయి మొక్క పెంచుతున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గంజాయికి అలవాటు పడ్డ ఓ వ్యక్తి ఇంట్లోనే గంజాయి మొక్క పెంచుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటగిరిలో ఓ వ్యక్తి గంజాయి మొక్క పెంచుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే బేగ్ రెసిడెన్సీ అపార్టమెంట్‌లో నాలుగవ అంతస్తులో ఉన్న ఓ ఫ్లాట్‌లో పోలీసులు తనిఖీ చేయగా గంజాయి మొక్క లభించింది. దాన్ని పెంచుతున్న అర్షద్ అలీని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రీ సర్వేలో పేర్లు నమోదు చేయించుకోవాలి


కుమ్మరివాడి బస్తీలో పర్యటిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, అధికారులు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మొదటి దఫా కుల గణనలో పేర్లునమోదు చేసుకోలేని బీసీలు రీ సర్వేలో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ సూచించారు. కుల గణన రీ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం ఆయన బీసీ వెల్ఫేర్ అధికారులు, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి చాంద్రాయణగుట్ట కుమ్మరివాడి బస్తీలో ప్రజలకు అవగాహన కల్పించారు. సర్వేలో పేర్లు నమోదు చేసుకోలేకపోయన వారి వివరాలను ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు సేకరించారు. 200 ఇళ్లను పరిశీలించగా అందులో 71 కుటుంబాల పేర్లు నమోదు చేసుకోలేదన్న విషయం తేలింది. సర్వే స్టిక్కర్లు అంటించారు.. కానీ ఎన్యుమరేటర్లు తమ ఇంటికి రాలేదని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ.. సర్వేపూర్తి స్థాయిలో జరగలేదని, బీసీల జనాభా తక్కువగా చూపారంటూ పలురకాల అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు రీ సర్వే చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారులు ఆశన్న, నర్సింహులు, సుశాంత్, సునీల్ బాబు, అంజనేయులు, టీపీసీసీ కార్యదర్శి బి.వెంకటేశ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు బోయ నగేశ్, కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్, ఎ.మహేశ్‌గౌడ్, రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.